ప్రశాంత ఎన్నికల నిర్వహణే లక్ష్యం

- అభ్యర్థులు ప్రచారానికి 48 గంటల ముందుగా దరఖాస్తు చేసుకోవాలి
- పోలీసుల సహకారంతో సమస్యాత్మక ప్రాంతాల గుర్తింపు
- ఆర్డీవో కార్యాలయంలో ఎలక్షన్ కంట్రోల్ రూం ఏర్పాటు
- ఎన్నికల నిర్వహణకు 2 వేల మంది సిబ్బంది
- ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి
- నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి జయరాం



సాక్షి ఇంటర్వ్యూ

నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి జయరాం

నర్సీపట్నం : ప్రశాంత ఎన్నికల నిర్వహణే లక్ష్యమని ఎన్నికల రిటర్నింగ్ అధికారి హెచ్.వి.జయరాం పేర్కొన్నారు. భారత రాజ్యాంగం కల్పించిన ఓటును ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా వినియోగించుకోవాలన్నారు. శుక్రవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ ఎన్నికల షెడ్యూల్ వచ్చినప్పటి నుంచి నిబంధనలు పక్కాగా అమలు చేస్తున్నామన్నారు. ఎన్నికల నిర్వహణపై పలు అంశాలు తెలిపారు.

మే 13న స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. షెడ్యూల్ వెలువడిన రోజు నుంచే కోడ్ అమల్లోకి వచ్చిందన్నారు. కౌంటింగ్ పూర్తయ్యే వరకు అప్రమత్తంగా ఉండి అంతా సజావుగా నిర్వహిస్తామన్నారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఎన్నికల ప్రచారానికి అవసరమయ్యే వాహనాలు, ఇతర అనుమతుల మంజూరుకు సువిధ పోర్టల్ లేదా నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చని రిటర్నింగ్ అధికారి పేర్కొన్నారు. వాహనాల అనుమతికి సంబంధించి దరఖాస్తుతో పాటు వాహన రిజిస్ట్రేషన్ (ఆర్‌సీ బుక్) వివరాలు, డ్రైవింగ్ లైసెన్సు, వాహన యజమాని పేరు, డ్రైవర్ పేరు, చిరునామా, మొబైల్ నంబరు తదితర వివరాలు జత చేయాలన్నారు. ర్యాలీలు, రోడ్ షోల వంటి కార్యక్రమాల అనుమతికి ప్రదేశం, రూట్ మ్యాప్, ర్యాలీలో పాల్గొనే వారికి సంఖ్య, తేదీ, సమయం తదితర వివరాలు తెలియజేయాలన్నారు. ఎలాంటి అనుమతి కోసమైనా కనీసం 48 గంటల ముందుగా దరఖాస్తు చేయాలన్నారు. అనుమతి లేకుండా ఎలాంటి ప్రచార కార్యక్రమాలు నిర్వహించినా, వాహనాలను ప్రచారానికి వినియోగించినా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినట్టుగా పరిగణించి తగు చర్యలు తీసుకుంటామని రిటర్నింగ్ అధికారి తెలిపారు. పోలీసు వారి సహకారంతో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించామన్నారు. వీటిపై ఇప్పటికే ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. ఆర్డీవో కార్యాలయంలో ఎలక్షన్‌కు సంబంధించి కంట్రోల్ రూం ఏర్పాటు చేశామన్నారు. ఏమైనా అభ్యంతరాలు, ఫిర్యాదులు ఉంటే టోల్ నంబరు 9491651223 ఫోన్ చేయవచ్చన్నారు. నేరుగా కంట్రోల్ రూమ్‌లో ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఎన్నికల నిర్వహణకు సుమారు 2 వేల మంది సిబ్బందిని వినియోగిస్తున్నామన్నారు. ఈ నెల 16 నుంచే ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చిందన్నారు. ఏప్రిల్ 18న ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనుందని చెప్పారు. ఏప్రిల్ 25 వరకు నామినేషన్లు స్వీకరిస్తామని, 26న స్క్రూటినీ, 29న విత్‌డ్రాలు చేసుకోవచ్చన్నారు. నలుగురు ఏఆర్‌వోలను నియమించామని తెలిపారు. మద్యం, నగదు, తాయిలాలు పంపిణీ చేయటం చట్టరీత్యా నేరం అన్నారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే ఎలక్షన్ కమిషన్ నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు.

నియోజకవర్గ స్వరూపం	
మొత్తం ఓటర్లు	: 2,08,873
పురుషులు	: 101312
మహిళలు	: 107556
థర్డ్‌జెండర్స్	: 5
పోలింగ్ కేంద్రాలు	: 262
ఏఆర్‌వోలు	: 4
పోలింగ్ ఆఫీసర్లు	: 262
సెక్టార్ ఆఫీసర్లు	: 24
రూట్ ఆఫీసర్లు	: 24
ఫ్లయింగ్ స్క్వాడ్	: 9

రాజకీయ పార్టీల అభ్యర్థుల కోసం..

- అభ్యర్థులు తమ ప్రచారం కోసం అనుమతి తీసుకోవాలంటే 48 గంటలు ముందుగా తెలపాలి.
- వాహనాల అనుమతికి దరఖాస్తుతో పాటు వాహన రిజిస్ట్రేషన్ (ఆర్‌సీ బుక్) వివరాలు, డ్రైవింగ్ లైసెన్సు, వాహన యజమాని పేరు, డ్రైవర్ పేరు, చిరునామా, మొబైల్ నంబరు జత చేయాలి.
- ర్యాలీలు, రోడ్ షోల అనుమతికి ర్యాలీ నిర్వహించే ప్రదేశం, రూట్ మ్యాప్, ర్యాలీలో పాల్గొనే వారి సంఖ్య, తేదీ, సమయం వంటివి ముందుగా తెలపాలి.
- ప్రచారాలకు అనుమతి కోసం సువిధ పోర్టల్ లేదా నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చు.

అభివృద్ధికి.. రాచబాట

- మాడుగులలో మారుమూల గ్రామాలకు మహర్దశ
- రూ. 4 కోట్ల పీఎంజీఎస్‌వై నిధులతో కొత్తగా రోడ్ల నిర్మాణం
- తీరనున్న 20 గ్రామాల ప్రజల కష్టాలు



డి.గొటివాడ నుండి సాగరం మీదుగా మాడుగుల వరకు రోడ్డు నిర్మాణం జరుగుతున్న దృశ్యం



అప్పట్లో రాళ్లు, మట్టి తేలిన డి.గొటివాడ రోడ్డు దుస్థితి

మాడుగుల : స్వాతంత్ర్యానికి ముందు నుండి అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న మాడుగుల నియోజకవర్గంలోని మారుమూల గ్రామాలకు రహదారి సౌకర్యం లేక అభివృద్ధికి నోచుకోలేదు. కొండ, గెడ్డలు దాటలేక వర్షాకాలంలో ఎలాంటి అనారోగ్యానికి గురైనా వైద్యం అందక స్థానికులు నరక యాతన పడేవారు. తాగునీటికి కటకటలాడేవారు. 108, 104 వాహనాలు ఈ గ్రామాలకు రావడానికి రహదారులు లేవు. విద్య, వైద్యం అంతంతమాత్రంగానే అందేవి. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు స్వయంగా ఇక్కడి వారి కష్టాలు చూశారు. దీంతో సుమారు 7.2 కిలోమీటర్ల రోడ్డుకు రూ. 4 కోట్ల పీఎంజీఎస్‌వై నిధులు గతంలో మంజూరు చేశారు. ఈ నిధులతో డి.గొటివాడ నుండి సాగరం మీదుగా మాడుగుల వరకు రోడ్డు నిర్మాణం దాదాపు పూర్తి కావస్తుండడంతో ఆయా గ్రామాల ప్రజలు తమ కష్టాలు తీరనున్నాయని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. చౌక దుకాణాల్లో సరుకులు, అవసరార్థం బయటికి వెళ్లాలన్నా కిలోమీటర్ల మేర కాలి నడకన వెళ్లాల్సి వచ్చేది. అలాగే మంచినీటికి ఇక్కట్లు పడేవారమని.. అయితే ప్రస్తుతం తమ నీటి కష్టాలు తీరాయని 20 గ్రామాలకు చెందిన ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సీసీ రోడ్లు, ప్రధాన డ్రైనేజీలు పూర్తి కావడంతో పాటు మండల కేంద్రానికి రాకపోకలు సాగించేందుకు వీలుగా పక్కా రోడ్లు ఏర్పాటు చేయడంతో సులువుగా రాకపోకలు సాగిస్తున్నామని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గతంలో గర్భిణులను డోలీలో ఆస్పత్రికి తరలించేవారమని, ప్రస్తుతం ఆ ఇబ్బంది తప్పిందని ఆయా గ్రామాల ప్రజలు సంతోషంగా తెలిపారు.

సీనియర్ నాయకుడు మురళీకృష్ణకు ఎమ్మెల్యే గణేష్ పరామర్శ



సీనియర్ నాయకుడు లగుడు మురళీకృష్ణను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ఉమాశంక్ గణేష్

గొలుగొండ : అనారోగ్యానికి గురైన మండలంలోని ఏఎల్‌పురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు లగుడు మురళీకృష్ణను ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ శుక్రవారం పరామర్శించారు. ఆయన త్వరలో కోలుకోవాలని ఆకాంక్షించారు. పార్టీకి ఎనలేని సేవలందించిన మురళీకృష్ణ త్వరలో జరిగే ఎన్నికల్లో పాల్గొని పార్టీ విజయానికి కృషి చేయాలని పేర్కొన్నారు. మార్కెట్ యార్డు చైర్మన్ చిటికెల భాస్కర్‌నాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు సుర్ల గిరిబాబు, పార్టీ మండల అధ్యక్షుడు లెక్కల సత్యనారాయణ, మండల సచివాలయ కన్వీనర్ల సంఘం అధ్యక్షుడు కొరుప్రోలు పానీ శాంతారాం తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు పోస్టల్ బ్యాలెట్ అవకాశం



తహసీల్దార్ రవిచంద్ర

రోలుగుంట : త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఈ ఏడాది నుంచి మంచంపై ఉండి నడవలేని వృద్ధులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేయొచ్చనే ఉత్తర్వులు జారీ అయ్యాయని తహసీల్దార్ కె.రవిచంద్ర తెలిపారు. తన కార్యాలయంలో ఆయన శుక్రవారం ఎన్నికల నిర్వహణ, పోస్టల్ బ్యాలెట్ అర్హతల గురించి మాట్లాడారు. ఇప్పటి వరకూ ఉద్యోగులు, దివ్యాంగులకు ఈ విధంగా ఓటు వేసే అవకాశం ఉండేదన్నారు. తాజాగా 85 సంవత్సరాలు దాటి నడవలేని వృద్ధులకు కూడా ఎన్నికల కమీషన్ అటువంటి అవకాశం కల్పించిందన్నారు.

పోస్టల్ బ్యాలెట్ వినియోగంపై సమీక్ష..

పోస్టల్ బ్యాలెట్ అర్హతలు, వినియోగంపై నేడు (శనివారం) చోడవరం పద్మావతి కల్యాణ మండపంలో నియోజకవర్గం ఎన్నికల అధికారి చిన్నికృష్ణ ఉదయం 9.30 గంటలకు సమీక్ష నిర్వహిస్తారని తహసీల్దార్ కె.రవిచంద్ర తెలిపారు. ఈ సమావేశానికి బూత్ లెవల్ అధికారులు, క్లస్టర్ అధికారులు, ఎలక్షన్ విధుల్లో ఉన్న అధికారులు విధిగా హాజరు కావాలన్నారు.

వస్త్ర దుకాణం యజమాని కారులో చీరలు

- సీజ్ చేసిన ఫ్లయింగ్ స్క్వాడ్

చోడవరం : కారులో అక్రమంగా చీరలు కలిగి ఉన్నారని ఆరోపిస్తూ జెడ్పీటీసీ సభ్యురాలి భర్త, శ్రీ దుర్గా టెక్స్‌టైల్ వస్త్ర దుకాణం యజమాని మారిశెట్టి శ్రీకాంత్‌పై చోడవరం పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. అయితే తన దుకాణంలో విక్రయించేందుకు మాత్రమే వాటిని తీసుకొస్తున్నానని శ్రీకాంత్ స్పష్టం చేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో ఫ్లయింగ్ స్క్వాడ్ విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తోంది. చోడవరం బజార్ వీధిలో డి.సురేఖ నేతృత్వంలోని ప్రత్యేక ఫ్లయింగ్ స్క్వాడ్ శ్రీకాంత్ కారును తనిఖీ చేసి అందులో 46 చీరలు, 3 లంగా ఓణీలు ఉన్నట్టు గుర్తించారు. ఈ సరకుకు సంబంధించి అప్పటికప్పుడు సరైన రికార్డులు చూపించకపోవడంతో ఎన్నికల్లో పంచేందుకే తీసుకొస్తున్నారన్న అనుమానంతో చోడవరం పోలీసు స్టేషన్‌కు అప్పగించారు. దీనిపై కేసు నమోదు చేసి కారును, దుస్తుల్ని సీజ్ చేశామని సీఐ బి.శ్రీనివాసరావు విలేకరులకు తెలిపారు. ఇదిలా వుండగా శ్రీకాంత్ మాట్లాడుతూ చోడవరంలో తనకు వస్త్ర దుకాణం ఉందని, ఆ షాపులో చీరలు, లంగా ఓణీలు అమ్ముకునేందుకు తెచ్చానన్నారు. తాను వ్యాపారం చేసుకుంటున్నాను తప్ప అవి ఏ పార్టీ తరఫున తాయిలాలుగా ఇచ్చేందుకు తేలేదన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ తనను తనిఖీ చేసే సమయంలో తన వద్ద గాని, తన కారులో గానీ ఏ పార్టీకి చెందిన జెండాలు, ఇతర ఏ ఎన్నికల ప్రచార సామగ్రి లేవని, ఇదే విషయాన్ని పోలీసులకు చెప్పానని శ్రీకాంత్ తెలిపారు.

పాడి రైతులకు రాయితీ విత్తనాలు



మాట్లాడుతున్న పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ దినేష్‌కుమార్

కె.కోటపాడు : వేసవిలో పశుగ్రాస సమస్య తలెత్తకుండా పాడి రైతులకు రాయితీపై గడ్డి విత్తనాలు అందించనున్నట్లు కె.కోటపాడు పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఇ.దినేష్‌కుమార్ తెలిపారు. కె.కోటపాడు, దేవరాపల్లి మండలాల్లో గల పశు వైద్యాధికారులు, పశు వైద్య సహాయకులతో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. 75 శాతం రాయితీపై రైతులకు ఈ గడ్డి విత్తనాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. అదే విధంగా ఈ నెలాఖరులోగా లక్ష్యం మేరకు 3 నుండి 8 నెలల పెయ్యిలకు బ్రూసిల్లోస్ టీకాలు వేయాలని తెలిపారు. గొర్రె, మేకల్లో పారుడు వ్యాధి రాకుండా ముందస్తుగా పీపీఆర్ వ్యాక్సిన్, తెలుపు రంగు జాతి ఆవులకు లంపీ స్కిన్ టీకాలు వేయాలని సూచించారు. కార్యక్రమంలో కొరువాడ పశు వైద్యాధికారి సీహెచ్‌వై నాయుడు, ప్రియాంక, మంజూష పాల్గొన్నారు.

కోడ్ నేపథ్యంలో విగ్రహాలకు ముసుగులు

క్లుప్తంగా



ములగపూడిలో దివంగత నేత వైఎస్సార్ విగ్రహానికి ముసుగు వేస్తున్న సిబ్బంది

నాతవరం : ఎన్నికల కోడ్ కారణంగా వివిధ రాజకీయ పార్టీల నాయకుల విగ్రహాలకు అధికారులు ముసుగులు వేస్తున్నారు. మండలంలో యం.బెన్నవరం, నాతవరంతో పాటు ఇతర గ్రామాల్లో దివంగత నేతలు రాజశేఖర్ రెడ్డి ఎన్.టి.రామారావు విగ్రహాలకు శుక్రవారం ముసుగులు వేశారు. నాతవరంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు, దివంగత నేత అంకంరెడ్డి జెమీలు విగ్రహానికి సైతం పూర్తిగా ముసుగు వేయాలని టీడీపీ నేతలు పట్టుబట్టారు. మండలవ్యాప్తంగా దివంగత నేత వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి 35 విగ్రహాలతో పాటు ఇతర విగ్రహాలకు పోలీసులు దగ్గరుండి ముసుగులు వేశారు.

కూలీలందరికీ వంద రోజులు పని కల్పించాలి



కూలీలకు సూచనలిస్తున్న అధికారులు

మాకవరపాలెం: కూలీలందరికీ వంద రోజులు పని కల్పించాలని ఎంపీడీవో చంద్రరావు ఉపాధి సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని జి.గంగవరం గ్రామంలోని రాయపురాజు చెరువులో జరుగుతున్న పూడిక తొలగింపు పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మస్టర్ షీట్లను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జాబ్ కార్డు ఉన్న కూలీ లందరికీ 100 రోజులు పని కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పనికి రాకుండా మస్టర్లు వేస్తే సిబ్బందిపై వేటు తప్పదన్నారు. అలాగే గిట్టుబాటు కూలీ దక్కాలంటే ఎంత మేర పనులు చేయాలో టెక్నికల్ సిబ్బంది అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో వరలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

గిడుతూరులో 354 మందికి వైద్య పరీక్షలు



రోగి నుంచి వివరాలు తెలుసుకుంటున్న వైద్యురాలు

మాకవరపాలెం: ఆరోగ్య సురక్ష శిబిరంలో 354 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. మండలంలోని గిడుతూరు గ్రామంలో రెండో విడత ఆరోగ్య సురక్ష శిబిరం శుక్రవారం ఏర్పాటు చేశారు. దీనికి సచివాలయం పరిధిలోని గ్రామాల నుంచి హాజరైన 354 మంది రోగులకు వైద్యులు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఇద్దరు రోగులకు ఉన్నత వైద్య సేవలు అవసరమని గుర్తించారు. వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారి సీతారామలక్ష్మి, స్పెషలిస్టు వైద్యులు విద్యాసాగర్, హిమబిందు, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సీఏఏ చట్టం అమలును అడ్డుకోవాలి

మాడుగుల రూరల్ : మోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం పౌరసత్వ సవరణ చట్టమైన సీఏఏ అమలుకు నిబంధనలు ప్రకటించడాన్ని సీపీఎం తీవ్రంగా వ్యతిరేకిస్తుందని ఆ పార్టీ మండల కార్యదర్శి నరిసింహమూర్తి అన్నారు. మాడుగులలో శుక్రవారం సీఏఏ చట్టం అమలును అడ్డుకోవాలంటూ నిరసన తెలిపారు. ముస్లిం, మైనారిటీలను లక్ష్యంగా చేసుకుని ప్రకటించిన ఆ చట్టాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. 2019లో ఆమోదించిన సీఏఏ చట్టాన్ని ప్రజా ఆందోళనల వలన ఐదేళ్లు మూలన పెట్టి ఇప్పుడు ఎన్నికల్లో లబ్ధి పొందడానికి మళ్లీ తెరపైకి తెచ్చారని దుయ్యబట్టారు. సీఏఏ చట్టానికి వ్యతిరేకంగా కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు గండి నాయినిబాబు, యర్రా దేముడు తదితరులు పాల్గొన్నారు.

సమష్టిగా పని చేస్తే విజయం మనదే

కార్యకర్తలకు పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, విప్ ధర్మశ్రీ సూచన



సమావేశంలో మాట్లాడుతున్న విప్ ధర్మశ్రీ

బుచ్చెయ్యపేట : కార్యకర్తలు 52 రోజుల పాటు సమష్టిగా పని చేస్తే విజయం మనదేనని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తెలిపారు. శుక్రవారం సాయంత్రం చిన అప్పనపాలెం గ్రామంలో కోవెల జనార్దనరావు మామిడితోటలో జరిగిన కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో వీరు మాట్లాడుతూ ప్రజలంతా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేసిన అభివృద్ధికి ఆకర్షితులై ఓటు వేయడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ఓటర్లను పోలింగ్ కేంద్రానికి తీసుకెళ్లి వైఎస్సార్‌సీపీ ఓటు వేసేలా పని చేయాలన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే మరలా జన్మభూమి కమిటీల ద్వారా ప్రతి పనికి లంచం డిమాండ్ చేస్తూ ప్రజల్ని దోచుకుంటారన్నారు. పార్టీలో ఉన్న కొంత మంది కోవర్టులను దూరంగా ఉంచాలని, వారి వల్ల పార్టీకి నష్టం కలుగుతుందని జెడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబు, కోపరేటివ్ అధ్యక్షుడు సాయం రమేష్, ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి తదితరులు నాయకుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి గేదెల శేషు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు జోగా కొండబాబు, డి. నారాయణమూర్తి, కె. అప్పలనాయుడు, కె. ఈశ్వరరావు, నమ్మి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.



వెంకన్నపాలెంలో మద్దతు పలికిన నాయకులతో విప్ ధర్మశ్రీ



చోడవరంలో సకురు కోటేశ్వరరావు కుటుంబాన్ని కలిసిన ధర్మశ్రీ

విప్ ధర్మశ్రీకి మద్దతు పలికిన నాయకులు

చోడవరం : వెంకన్నపాలెం, చోడవరం గ్రామాల్లోని పలు వార్డుల్లో శుక్రవారం ప్రభుత్వ విప్ ధర్మశ్రీ పర్యటించారు. వెంకన్నపాలెంలో జిల్లా వైఎస్సార్‌సీపీ సేవాదళ్ అధ్యక్షుడు మొల్లి సోమునాయుడు, సర్పంచ్ మొల్లి ఈశ్వరరావు, పార్టీ నాయకులు సన్నీ యాదవ్, పిల్లల గోవింద, పాము అప్పలనాయుడు, జగదీష్, శరగడం చిమ్మినాయుడు తదితరులు పాల్గొని ధర్మశ్రీకి సంఘీభావం తెలిపారు. చోడవరంలో మాజీ సర్పంచ్ సకురు పెంటారావు కుటుంబ సభ్యులను ధర్మశ్రీ కలిసి వారి మద్దతు కోరారు. పెంటారావు కుమారుడు సకురు కోటేశ్వరరావు కుటుంబ సభ్యులతో ధర్మశ్రీకి మద్దతు పలికారు.

టెన్త్ గణితం పరీక్షకు 14 మంది గైర్హాజరు

మాడుగుల రూరల్ : మండలంలోని ఐదు కేంద్రాల్లో నిర్వహించిన టెన్త్ గణితం పరీక్షకు 772 మంది విద్యార్థులు హాజరు కావలసి ఉండగా 758 మంది హాజరయ్యారని, 14 మంది గైర్హాజరయ్యారని మండల విద్యాశాఖాధికారులు పాండురంగారావు, బి. దేముడమ్మ తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో ఎటువంటి మాస్ కాపీ జరగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామన్నారు.

రోలుగుంటలో ఏడుగురు..

రోలుగుంట : స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో టెన్త్ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. శుక్రవారం జరిగిన గణితం పరీక్షకు 224 మందికి 217 మంది హాజరైనట్టు చీఫ్ సూపరింటెండెంట్ దాడిశెట్టి రమేష్‌కుమార్ తెలిపారు. పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులకు కావాల్సిన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించినట్టు ఆయన తెలిపారు.

మహాసభను విజయవంతం చేయండి

దేవరాపల్లి : అనకాపల్లిలో తొలిసారిగా శనివారం జరిగే ఏఐటీయూసీ జిల్లా మహాసభను విజయవంతం చేయాలని రిక్షా, భవన నిర్మాణ కార్మికుల సంఘం ఉపాధ్యక్షుడు డి. ఈశ్వరరావు కోరారు. ఈ మేరకు మండలంలోని రైవాడ, బేతపూడిలో మహా సభ కరపత్రాలను శుక్రవారం పంపిణీ చేశారు. అనకాపల్లి రోటరీ హాల్లో ఉదయం 10 గంటలకు జరిగే ఈ మహాసభకు రిక్షా కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు తప్పనిసరిగా హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాయి సింహాద్రప్పడు, ఎడ్ల దేముళ్లు, గరికిన ఎల్లారావు, నాయుడు, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

జీడి మామిడిపై గ్రామీణ యువతకు అవగాహన



గ్రామీణ యువతకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

రావికమతం : చినపాచిల గ్రామంలోని పలువురు యువకులకు జీడిమామిడి ప్రాసెసింగ్, ముడి సరుకు కొనుగోలు, అమ్మకాలలో మెలకువలపై కృషి విజ్ఞాన కేంద్రం కొండెంపూడి శాస్త్రవేత్తలు శుక్రవారం అవగాహన కల్పించారు. శాస్త్రవేత్తలు ఎస్.సత్తిబాబు, కిషోర్ కుమార్‌తో పాటు కృషి విజ్ఞాన కేంద్రం యువ శాస్త్రవేత్తలు శ్రీకళ్యాణి జీడి మామిడి పరిశ్రమను సందర్శించారు. నిర్వాహకులతో పాటు పలువురు యువకులకు ఆ వ్యాపారంలో ఎదురయ్యే సమస్యలు, ఖర్చులు ఏ విధంగా తగ్గించుకోవాలి, మార్కెటింగ్‌లో సులువైన పద్ధతులు, ధరల గురించి వివరించారు.

పాఠశాలల్లో విధిగా మెనూ అమలు చేయాలి



విద్యార్థి అభ్యసన సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో రాంబాబు

నాతవరం: మధ్యాహ్న భోజనం మెనూ అమలులో నిబంధనలు పాటించాలని ఎంపీడీవో జాగరపు రాంబాబు అన్నారు. మండలంలోని వై.బి.అగ్రహారం పాఠశాలను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులకు పెడుతున్న మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. నిర్వాహకులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తర్వాత తరగతి గదులను పరిశీలించి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని పరీక్షించారు. ఎన్నికల సమయం కావడంతో చాలా చోట్ల ఉపాధ్యాయులు మెనూ విషయంలో నిర్లక్ష్యంగా ఉంటారన్న కారణంగా పాఠశాలలను తనిఖీ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి హుస్సేన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లల చదువు.. అవనికే వెలుగు

దేవరాపల్లి : దేవరాపల్లిలో బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమాన్ని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో దేవరాపల్లి ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు. బాలికలను రక్షిద్దాం, బాలికలను చదివిద్దాం కార్యక్రమంలో భాగంగా దేవరాపల్లి గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శి ఎం. సంధ్యారాణి విద్యార్థినులకు బాల్య వివాహాలు, భ్రూణ హత్యల నివారణ, అక్రమ రవాణా నిర్మూలన తదితర అంశాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. అనంతరం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.రాములమ్మ మాట్లాడుతూ ఆడపిల్లల చదువు అవనికే వెలుగు అని, ఆడ పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జనావాసాల మధ్య సెల్ టవర్ నిర్మాణం తగదు



ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ సంతోషి నళినికి ఫిర్యాదు చేస్తున్న రామకృష్ణ తదితరులు

దేవరాపల్లి : మండలంలోని కొత్తూరు ముత్యాలమ్మపాలెంలో జనావాసాల మధ్య సెల్ టవర్ నిర్మాణాన్ని తక్షణమే నిలిపి వేయాలని గ్రామస్తులు ముక్త కంఠంతో డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక సర్పంచ్ గంధం రామకృష్ణ సహా పలువురు గ్రామస్తులు ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ జి. సంతోషి నళినికి శుక్రవారం లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. జనావాసాల మధ్య సెల్ టవర్ నిర్మిస్తే రేడియేషన్ ప్రభావంతో ప్రజలు, పశు పక్ష్యాదుల్లో అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులకు ఫిర్యాదు చేసిన వారిలో గంధం పేరినాయుడు, గంధం కొండబాబు, పాతిరెడ్డి వెంకటరావు, రెడ్డి కన్నంనాయుడు ఉన్నారు.

వివాహిత ఆత్మహత్య

నర్సీపట్నం : కొత్తవీధికి చెందిన ఎం. అపర్ణ (20) ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. టౌన్ సీఐ కాంతి కుమార్ అందించిన వవరాలు ఇలా వున్నాయి. ఈమె పట్టణంలో ఓ మందుల దుకాణంలో పని చేస్తోంది. శుక్రవారం రాత్రి పడక గదిలోకి వెళ్లి చున్నీతో ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. ఆమె సోదరి జ్యోతి గమనించి కేకలు వేయడంతో చుట్టుపక్కల వారంతా వచ్చి ఆమెను కిందకు దించి సమీపంలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆమె మరణించిందని తెలిపారు. తన కుమార్తె మరణంపై పలు అనుమానాలు ఉన్నాయని తండ్రి సుబ్బన్న టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వడ్డాది వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



వడ్డాది పుర వీధుల్లో ఊరేగుతున్న వేంకటేశ్వర స్వామి

బుచ్చెయ్యపేట : వడ్డాది వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా మూడో రోజు ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం ఉదయం నుండి రాత్రి వరకు వేలాది మంది భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. సాయంత్రం సదస్యం నిర్వహించారు. శ్రీదేవి, భూదేవితో వేంకటేశ్వరస్వామికి కల్యాణం జరిగి మూడో రోజు కావడంతో రాత్రికి వడ్డాది పుర వీధుల్లో స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను గజగరుడ వాహనాలపై ఉంచి డప్పులు, వాయిద్యాల ఊరేగించారు. గిరిజాంబ కొండపై ఉత్సవ విగ్రహాలను ఉంచారు. తిరువీధి ఉత్సవంలో వేలాది మంది భక్తులు పాల్గొని స్వామిని స్తుతించారు. దీంతో గోవింద నామస్మరణ మార్మోగింది. కల్యాణ వేడుకల్లో భాగంగా నాల్గో రోజు శనివారం ఆలయంలో ప్రత్యేక పూజలు చేయడానికి దేవస్థానం అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు.